# దేశం నలుమూలలా అధికార హింసాకాండ

ఆగష్టు 31 - సెప్టెంబర్ 1 తేదీలలో హైదరాబాద్‌లో ఎపిసిఎల్‌సి - ఒపిడిఆర్‌ల ఆధ్వర్యంలో అఖిల భారత పౌరహక్కుల సదస్సు జరిగింది. ఆ సదస్సుకు బయటి రాష్ట్రాల నుండి అయిదు పౌరహక్కుల, ప్రజాస్వామ్య హక్కుల సంస్థలు హాజరయ్యాయి. ఆ సంస్థల ప్రతినిధులు స్వంత రాష్ట్రాలలోని పరిస్థితి గురించే కాక దేశవ్యాప్తంగా నెలకొని వున్న పరిస్థితిని గురించి కూడా తమ అభిప్రాయాలను తెలియ జేసారు. అనుభవాలను వివరించారు.

ఏ రాష్ట్రంలో నయినా ఏ పార్టీ పాలనలోనయినా 'రాజ్యహింస' సాధారణ అంశం అయిపోయిందని వారి అను భవాల నుండి తెలుస్తోంది. మన రాష్ట్రంలో ఎన్నికలప్పుడు కాంగ్రెస్(ఐ) - తెలుగు దేశం పార్టీలు పరస్పర హింసాకాండకు పాల్పడ్డాయి. ప్రజల మీద కూడా హింసకు పాల్పడ్డాయి. కడప, కర్నూలు, అనంతపురం జిల్లాలలో కాంగ్రెస్(ఐ) నాయకులు తెలుగుదేశం వారిని ప్రచారం చేసుకోనీయలేదు. బ్యానర్లు కట్టనీయలేదు, పోస్టర్లు వేయనీయలేదు. తెలుగుదేశం పార్టీ పరిస్థితి ఎంత దారుణంగా ఉండిందంటే, 'తెలుగుదేశం పాలనలో దళితులు ఎట్లా బతికారు ఇప్పుడు కాంగ్రెస్ పాలనలో తెలుగుదేశం వారు అట్లా బ్రతుకుతున్నారు' అని పరిశీలకులు వ్యాఖ్యానించే స్థితి ఏర్పడింది. అయితే తెలుగుదేశం వారు ఎదురుదెబ్బ తియ్యగల స్థితిలో వున్న నియోజక వర్గాలలో తామేమీ తక్కువ తినలేదని వాళ్ళు కూడా నిరూపించుకున్నారు.

పశ్చిమబెంగాల్‌కు చెందిన ఎపిడిఆర్ కార్యదర్శి సుజాతో భద్ర రిపోర్టు వింటే మార్క్సిస్టు పాలన ఇందుకు భిన్నమయినది కాదని అర్థం అవుతుంది. తమకు బలంగా వున్న గ్రామాలలో అన్యులు ప్రవేశించడానికి వీలులేదని సిపిఐ(ఎం) శాసనం. రాజకీయ ప్రత్యర్థుల హత్యలు పెద్ద ఎత్తున సాగుతున్నాయి. కాంగ్రెస్ వారు గూండాయిజంలో ఎవరికీ తీసిపోరు కాబట్టి తమ వంతుగా వాళ్ళు సిపిఐ(ఎం) కేడర్‌ను చంపుతున్నారు. ఈ పరంపర మొదలయిన్పటి నుండి 1000కి పైగా రాజకీయ హత్యలు పశ్చిమ బెంగాల్‌లో జరిగాయంటే ఆశ్చర్యం అనిపించక తప్పదు. మొన్నటి పార్లమెంటు ఎన్నికలలో ఒక గ్రామంలో కాంగ్రెస్‌కు ఓటువేసిన వారి చేతులు సిపిఐ(ఎం) వారు నరికేసిన ఉదంతం ప్రఖ్యాతి గాంచింది. ముఖ్యమంత్రి 'జ్యోతిబస్'ను అడిగితే 'బీహార్ కంటే నయమేకదా' అంటాడట! అంతకంటే మెరుగయిన సమాధానం వారికి దొరకక పోవడమే పరిస్థితి ఎంతగా దిగజారిందే సూచిస్తుంది.

'అర్చనాగుహ కేసు' పశ్చిమ బెంగాల్‌లో విఖ్యాతమయినది. ఎమర్జెన్సీలో రుణగుహ నియోగ్ అనే పోలీస్ అధికారి చేతిలో తీవ్రమయిన చిత్రహింసలకు గురి అయిన స్కూల్ టీచర్ అర్చనా గుహ. ఆమె శరీరం క్రింది భాగం చచ్చుపడి పోయింది. ఎమర్జెన్సీ ఎత్తివేసిన తరువాత ఆమె నియోగి మీద ప్రైవేటు కేసు వేసింది. అది 1978లో. అప్పుడే సిపిఐ(ఎం) రాష్ట్రంలో అధికారంలోకి వచ్చింది. ఇప్పటి దాకా అవిచ్ఛిన్నంగా ఏలుతూ వుంది. అర్చనా గుహ వేసిన కేసుకూడాఅగమ్యంగా సాగుతూ వుంది. ఈ 14 ఏళ్ళలో నియోగిని కనీసం సస్పెండ్ చేయమని బెంగాల్‌లోని ప్రజాస్వామివాదులు జ్యోతిబసు ప్రభుత్వానికి ఎన్నోసార్లు మొరపెట్టుకున్నారు. సస్పెండ్ చేయకపోగా, అతనికి రివాజుగా రావలసిన ప్రమోషన్లు వస్తూనే వున్నాయి. అతనిప్పుడు పశ్చిమబెంగాల్ పాలనా యంత్రాంగంలో సీనియర్ పోలీసు ఆఫీసరు. అతనికి న్యాయ సహాయం తక్కువలేదు. అతనికి న్యాయవాది స్వయంగా మాజీ కేంద్ర న్యాయశాఖా మాత్యుడు అశోక్ సేన్! అతనిని కాపాడే విషయంలో సిపిఐ(ఎం) ప్రభుత్వానికీ, కాంగ్రెస్ నాయకునికీ ఎటువంటి వైరం లేదు.

బెంగాల్ గురించి మొదట ప్రస్తావించడంలో ఉద్దేశ్యం సిపిఐ(ఎం)ను భ్రష్టు పట్టించాలని కాదు. దేశంలో ప్రజాస్వామిక విలువలు పూర్తిగా దిగజారుతున్న దశలో కనీసం వామపక్ష పార్టీలన్నీ ప్రజల హక్కుల పట్ల గౌరవంతో మెలగుతాయనీ ప్రజాస్వామిక విలువలకు అనుగుణంగా నడుచుకుంటాయనీ ప్రజలు ఆశించడం సహజం. ఆ ఆశ ఎంత వాస్తవికమయినదో తెలుసుకోవలసిన అవసరం ఉంది కాబట్టి ఈ వివరాలు చెప్పడం. ఎమర్జెన్సీకి ముందు పశ్చిమ బెంగాల్‌ను ఏలిన కాంగ్రెస్ వారికీ ఎమర్జెన్సీ ఎత్తివేసిన నాటినుండి ఏలుతున్న సిపిఐ(ఎం)కూ పోలీసుల అత్యాచారాల పట్ల వున్న వైఖరిలో తేడా ఏమిటంటే, కాంగ్రెస్ ప్రభుత్వం ఎంక్వయిరీ రిపోర్టులు కనీసం బహిరంగ పరచకుండా ఉపేక్షిస్తే, సిపిఐ(ఎం) ప్రభుత్వం నివేదికలను బయటపెట్టి వాటి సూచనలను ఉపేక్షిస్తుందని ఎపిడిఆర్ కార్యదర్శి అన్నారు. ఎమర్జెన్సీ అత్యాచారాల గురించి ఆనాడు వేసిన న్యాయ విచారణ కమీషన్ల రిపోర్టులను ఇన్నేళ్ళయినా జ్యోతిబసు ప్రభుత్వం అమలు చేయలేదన్నారు.

దీనిని బట్టి ఒక విషయం అర్థం అవుతుంది. "రాజ్యహింస"కు మన సమాజంలో చాలా బలమయిన పునాది వుంది. అది ఒక పార్టీతో రాలేదు. ఒక పార్టీతో పోదు.

బీహార్‌లోని పరిస్థితి గురించి ఢిల్లీకి చెందిన పియుడిఆర్ కార్యదర్శి హరీశ్ ధావన్ వివరంగా మాట్లాడగా, ఎపిడిఆర్ కార్యదర్శి, మహారాష్ట్రకు చెందిన లోక్‌షాహి హక్ సంఘటన ప్రతినిధి, తమ ప్రసంగాలలో ప్రస్తావించారు. అన్నిచోట్ల భూస్వాముల ఆస్తులనూ అధికారాన్ని పోలీసులు కాపాడితే బీహార్‌లో భూస్వాములే స్వయంగా 'సేనలు' ఏర్పాటు చేసుకొని కూలిజనంపైన దాడులు చేస్తారు. పోలీసులు వారికి చేదోడు వాదోడుగా నడుచుకుంటారు. వాళ్ళు హత్యలు చేస్తే కేసులు పెట్టరు. కూలిజనం ప్రతిఘటిస్తే మట్టుకు వెంటనే అరెస్ట్ చేసి మళ్ళీ కదలకుండ కేసులు పెట్టి జైలుకు పంపుతారు. భూస్వాముల సేనలు కులాన్ని బట్టి, ప్రాంతాన్ని బట్టి వుంటాయి. వాటి పేర్లు చాలా ఆకర్షణీయంగా ఉంటాయి. సన్‌లైట్ సేన, బ్రహ్మర్షి సేన, మొదలయినవి. చుండూరు మారణకాండ తరువాత కోస్తా జిల్లాలో ఊరూరా వెలసిన 'సర్వజనాభ్యుదయ పోరాట సమితి" మన రాష్ట్రంలోనూ ఒక అగ్రకుల సేనకు నాంది కాగలదా? ఆగష్టు 17న వాళ్ళు గుంటూరు ఎ.సి. కాలేజీ మీద జరిపిన దాడిని బట్టి చూస్తే ఇందులో ఆశ్చర్యమేమీ లేదు.



నాలుగు దశాబ్దాల ప్రజాస్వామ్యం-నడిబజారులో నలుగుతున్న విధం

పోలీసుల మీద చట్టపరంగా అనేక అధికారాలున్న జిల్లా కలెక్టర్లు, మెజిస్ట్రేటులు, జడ్జీలు, వాస్తవంలో పోలీసులను నియంత్రించడంలో ఎంత నిస్సహాయులో మనం చూస్తూనే ఉన్నాం. బీహార్ రాష్ట్రం పరిస్థితి మన పరిస్థితి కంటే అధ్వాన్నమయినది. (అలాగని జ్యోతిబసులాగ సంతృప్తి చెందాలని కాదు). పలమూ జిల్లాలో అతి క్రూరుడైన ఒక భూస్వామిని అరెస్టు చేసే సదుద్దేశంతో ఆ జిల్లా కలెక్టర్ ఒకనాడు బయలుదేరారంట. ఆమె అతనిని అరెస్టు చేయడంలో విఫలం కావటమే కాక, ఆమెమీదనే 'దురాక్రమణ, దౌర్జన్యం' కేసులుపెట్టి ఎఫ్.ఐ.ఆర్. నమోదు చేసాడంట! 'ఈ కథ మన జిల్లా కలెక్టర్లకు తెలియకుండ చూసుకుంటే మంచిది - ఇప్పటికే కానిస్టేబుళ్ళను చూసి దడుసుకుంటున్నారు).

బీహార్‌లో నిర్బంధాన్ని ఎదుర్కొంటూ వున్న పోరాటం ఆంధ్రప్రదేశ్ లాగ గ్రామీణ పేద రైతాంగ పోరాటం. దానిమీద అమలయ్యే అణచివేతలో ఎన్ని తేడాలున్నా పోలికలే ఎక్కువ ఉంటాయి. చిత్రహింసలు, ఎన్‌కౌంటర్లు, తప్పుడు కేసులు, 'టాడా' ప్రయోగం, గ్రామాలపైన అర్థరాత్రి దాడులు - ఇవేమీ మనకు కొత్త కాదు. ఎటొచ్చీ ఒకచోట మొత్తం నిర్బంధం పోలీసుల అమలు చేస్తే మరొకచోట భూస్వాముల సేనలూ పోలీసులు కలిసికట్టుగా అమలు చేస్తున్నారు.

అస్సాం, పంజాబ్, కాశ్మీర్ వేరే రాజకీయ నేపథ్యానికి చెందిన ఉద్యమాలు. వాటి ఉధృతి ఫలితంగా పరిపాలనా యంత్రాంగానికవి ప్రధాన సవాలుగా పరిణమించాయి. రాజ్యం ఇక్కడ కొత్త కొత్త అణచివేత పద్ధతులలో తర్ఫీదవుతుంది. అణచివేతను సమర్థించడానికి కొత్త కొత్త వాదనలు ఇక్కడ కనుక్కుంటూ వుంది. ఆ పద్ధతులనూ ఆ వాదనలనూ దేశమంతటా ప్రయోగించడానికి సమాయత్తమవుతూ వుంది.

దురదృష్టవశాత్తు ఈ సదస్సులో అస్సాం గురించే తప్ప పంజాబు కాశ్మీరుల గురించి రిపోర్టు ఎవ్వరూ ఇవ్వలేదు. 'దురదృష్టం' ఎందుకంటే పంజాబ్, కాశ్మీర్‌లలో ఉద్యమకారులు హైందవేతరులు కావడం వలన అక్కడ రాజ్యం నిర్బంధాన్ని మరింత తీవ్రంగా అమలు చేస్తూ వుంది. నిర్లజ్జగా సమర్థిస్తూ వుంది. నిర్లజ్జ ప్రభుత్వంతో

పోటీ పడుతూ ఒక సీనియర్ పాత్రికేయుడూ ఒక సీనియర్ విలేకర్ల సంఘం నాయకుడూ ప్రెస్ కౌన్సిల్ పంపగా కాశ్మీర్ వెళ్ళి అక్కడ మిలిటెంట్ల ఆగడాలు తప్ప అంతా ప్రశాంతమేనని అంతా ప్రజాస్వామ్యమే నని ప్రకటించారు. సైన్యం మీద వచ్చిన ఆరోపణలన్నీ అబద్ధాలన్నారు. అంతర్జాతీయంగా భారతదేశాన్ని భ్రష్టు పట్టించడానికి జరుగుతూ వున్న కుట్ర అన్నారు. కాశ్మీరులో ఉద్యమకారులు ముస్లింలు కాబట్టి కాశ్మీర్‌లో సైన్యం ఆగడాలను ప్రశ్నించడం జాతి విద్రోహ చర్య అయి కూర్చుంది. తార్కుండే వంటి ప్రముఖుడు కాశ్మీర్‌లో సైన్యం అత్యాచారాలకు పాల్పడుతూ వుందనీ, కాశ్మీర్ ఉద్యమం పట్ల విశాల ప్రజానీకానికి అనుకూల భావం ఉందనీ, వాళ్ళకు రాజకీయంగా ఆమోదనీయ మయిన పరిష్కారానికి వెతకటమే సరయిన విధానమనీ అంటే ఆయన సహితం దేశద్రోహి అయ్యాడు. ప్రెస్ కౌన్సిల్ బృందం సైన్యానికి కితాబు ఇవ్వగానే 'ఇక తార్కుండే సంజాయిషీ చెప్పుకోవాలం'టూ ప్రముఖ దిన పత్రికలు రాయసాగాయి.

అస్సాంలో సైన్యం అమలు చేస్తూన్న నిర్బంధ కాండ గురించి మాట్లాడిన పిపిడిఆర్ (బొంబాయి) ప్రతినిధి ఒక మాట అన్నారు. అస్సాంలో అల్ఫా ను ఏరివేసే కార్యక్రమానికి ఆపరేషన్ బజరంగ్‌దళ్ అని పేరు పెట్టారు. సైనిక చర్యలకు అటువంటి హైందవమత సంబంధమయిన పేరు పెట్టటం, అందులోనూ ఉత్తర భారతదేశంలో ప్రజలకు ఆరాధ్యు డయిన ఆంజనేయుడి పేరు పెట్టడం, క్రమంగా పెరుగుతూ ఉన్న హైందవ మత రాజ్యానికి చిహ్నమని ఆయన అన్నారు. గతంలో 'ఆపరేషన్ బ్లూస్టార్'లు 'బ్లాక్ థండర్'లు చూసాము గానీ హైందవ మత సంబంధమయిన పేరు పెట్టడం ఇదే ప్రథమం.

సైన్యం అస్సాంలో ఏం చేస్తోందంటే తాను చేయగల ఒకే ఒకపని చేస్తోంది. మనుషుల్ని చంపుతోంది, మాయం చేస్తోంది, స్త్రీలను రేప్ చేస్తోంది, ఇళ్ళు గుల్ల చేస్తోంది, ఊళ్ళు ఖాళీ చేయిస్తోంది. నిజానికి ఈశాన్య భారతంలో సైన్యానికిది కొత్త కార్యక్రమం కాదు. 1956 నుండి నాగాలండ్‌లో మిజోరాంలో మణిపూర్‌లో ఇదే చేస్తూ వుంది. ఇప్పుడు తన పంజాను అస్సాంకు విస్తరించింది.

పౌరులలో శాంతి భద్రతలు నెలకొల్పే పోలీసు యంత్రాంగానికి విదేశీయులతో యుద్ధం చేసే సైన్యానికీ వ్యవహార నియమాలలోను, తర్ఫీదు లోనూ తేడా ఉంటుంది. పోలీసు యంత్రాంగం చట్టాన్ని గౌరవిస్తూ, పౌరుల హక్కులను కాపాడుతూ, తన విధి నిర్వహణ చేయాలి. సైన్యానికి యుద్ధంలో విజయం తప్ప వేరే నియమం లేదు. పోలీసు యంత్రాంగం తన విధి నిర్వహణలో బలప్రయోగం చేయవలసి వస్తే అది కనీస బలప్రయోగం మట్టుకే కాగలదు. సైన్యం మందుగుండు వృధా చేయకుండా అతి సమర్థవంతమయిన బల ప్రయోగం చేయాలి. అటువంటి సైన్యాన్ని తీసుకొచ్చి సామాజిక సంక్షోభాల మీద రాజకీయ ఉద్యమాల మీద ప్రయోగించడం దారుణం. పైగా అనియతమయిన సైనిక బలాన్ని చట్టబద్ధం చేస్తూ సైనిక బలగాల (ప్రత్యేక అధికారం) చట్టాన్ని రూపొందించారు. ఈ చట్టం ఈశాన్య భారతంలో, పంజాబులో అమలులో వుంది. కాశ్మీర్‌లో మరింత పదునయిన రూపంలో అమలులో వుంది. విచ్చలవిడి అరెస్టులకు, నిర్బంధానికీ, సోదాలకూ, జప్తులకూ ఈ చట్టం సైన్యానికి పూర్తి స్వేచ్ఛ నిస్తుంది.

అస్సాం పరిస్థితే ఇదయితే ఒక పంజాబు కాశ్మీర్ల పరిస్థితి గూర్చి చెప్పనవసరం లేదు.

చివరగా 'టాడా' గురించి సదస్సులో వచ్చిన చర్చను ప్రస్తావించాలి. 'శాంతి భద్రతల యంత్రాంగం విఫల మయినప్పుడు మాత్రమే ప్రయోగించాల్సిన ప్రత్యేక శాసనం' అని సుప్రీంకోర్టు అభివర్ణించిన ఈ చట్టం క్రమంగా సాధారణ నేర విచారణ స్మృతి స్థానాన్ని ఆక్రమించుకుంటూ వుంది. మన రాష్ట్రంలో 'నక్సలైట్లు' అని నామకరణం చేయబడ్డ వాళ్ళు ఎంతలేదన్నా 15000 మంది టాడా ముద్దాయిలుగా ఉన్నారు. దేశంలో ఈ రాష్ట్రం ఆ రాష్ట్రం అన్న తేడా లేకుండా అన్ని రాష్ట్రాలలోనూ దానిని ప్రయోగిస్తున్నారు. భారత రాజ్యాంగం లోని ప్రాథమిక హక్కులకూ, అంతర్జాతీయ మానవ హక్కుల ప్రకటనకూ, ఐక్యరాజ్య సమితి పౌర రాజకీయ హక్కుల ఒడంబడికకూ స్పష్టంగా వ్యతిరేకమయిన ఈ చట్టాన్ని విచ్చల విడిగా ఉపయోగిస్తున్నారు. పంజాబును సాకుగా చూపించి ఆవిర్భవించిన ఈ చట్టం పంజాబుతో ఏ నిమిత్తం లేని ప్రాంతాలలోను వాడుకలోకి వచ్చింది.

మనం ఇవ్వాళ ఒక ప్రత్యేక మయిన రాజకీయ పరిస్థితిలో జీవిస్తున్నాం. పాలక వ్యవస్థ పట్ల ప్రజలలో వేగంగా పెరిగి పోతున్న అవిశ్వాసం గతంలో ఎన్నడూ చూసి ఎరుగని మిలిటెంట్ పోరాటాల రూపం తీసుకుంటూ వుంది. ఆ పోరాటాలన్నీ అందరికీ నచ్చక పోవచ్చు. కాని ఇదొక చారిత్రక పరిణామం అని గుర్తించక పోవడం మూర్ఖత్వం అవుతుంది. పాలక వ్యవస్థ తాను కోల్పోయిన ప్రజాదరణను విశ్వాసాన్ని ప్రజాస్వామికంగా తిరిగి పొందే ప్రయత్నమేమీ చేయకుండా నిర్బంధంతో విరుచుకు పడుతు వుంది. ప్రస్తుతం దేశం నలుమూలలా అమలవుతున్న అధికార హింసాకాండకు మూలం ఇది. అందుకే పౌరహక్కుల పరిరక్షణకు కలిసికట్టుగా ఉద్యమించ వలసిన అవసరం ఉంది. బలమయిన ప్రతిఘటనను నిర్మించవలసిన అవసరం ఉంది.

— కె. బాలగోపాల్.